సాక్షి
ఒడిశా
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,86,707లు, బంగారం 2 గ్రాముల 400 మిల్లీగ్రాములు వెండి 35 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వీడని వరద..!

వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు మల్కన్‌గిరి, కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.

- 8లో



చదువుతోనే ప్రగతి సాధ్యం

చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందని ఇంఫా కర్మాగారానికి చెందిన ప్రజా సంబంధాల అధికారి శక్తి ప్రసాద్ పాణిగ్రహి అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

భువనేశ్వర్: బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు బుధవారం తెలిపారు. గురువారం పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో తుఫాను ఏర్పడే అవకాశం ఉందని, ఇది సెప్టెంబర్ 13 నాటికి అల్పపీడనంగా మారుతుందని ఈ వర్గాల సమాచారం. తదుపరి 24 నుంచి 48 గంటల్లో వ్యవస్థ మరింత తీవ్రమై అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఈనెల 13 నుంచి 15 తేదీల మధ్య రాష్ట్రంలో బాలాసోర్, మయూర్‌భంజ్ మరియు సుందర్‌గడ్ ప్రాంతాలతో సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భద్రక్, ఢెంకనాల్, కెంజొహర్, జాజ్‌పూర్, దేవ్‌గడ్ మరియు ఝర్సుగుడ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయి. ఈ ప్రభావం పరిసర ప్రాంతాలపై స్వల్పంగా ఉంటుందని అంచనా.

భువనేశ్వర్‌లో అదుపులోనే డెంగీ

● మేయర్ సులోచన దాస్

భువనేశ్వర్: నగరంలో డెంగీ పరిస్థితి అదుపులోనే ఉందని స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ మేయర్ సులోచన దాస్ తెలిపారు. డెంగీ రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, భయపడాల్సిన అవసరం లేదన్నారు. భువనేశ్వర్‌లో డెంగీ కేసులు ఎక్కువగా ఉన్నాయి, ఎందుకంటే రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆస్పత్రులు రాజధాని నగరంలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భువనేశ్వర్‌కు వచ్చి ఇక్కడ పరీక్షలు చేయించుకుని వైద్యం చేయించుకుంటున్నారని ఆమె తెలిపారు. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సిబ్బంది వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతీ శుక్రవారం పొడి దినం ఉద్యమంలో పాల్గొని ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ నివారించాలని ఆమె నగర వాసులను అభ్యర్థించారు. ఫాగింగ్ గురించి మేయర్ మాట్లాడుతూ.. వర్షం తర్వాత కార్యకలాపాలు తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రజలు దోమ తెరలు వాడాలని, జ్వరం వస్తే వైద్యులను తక్షణమే సంప్రదించాలని కోరారు.

గోడకూలి వృద్ధురాలి దుర్మరణం



మృతి చెందిన వృద్ధురాలు

జయపురం: సబ్ డివిజన్‌లో పడుతున్న కుండపోత వర్షాలకు ఒక ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన కోట్‌పాడ్ సమితి దమణహండి పంచాయతీ సొరకుహండి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మరణించిన వృద్ధురాలు సూర్య హరిజన్(70)గా పేర్కొన్నారు. మంగళవారం రాత్రి సూర్యహరిజన్ ఒక గదిలో పడుకోగా, ఆమె కుమారుడు, కోడలు మరో గదిలో నిద్రపోతున్నారు. అయితే అర్ధరాత్రి ఇంటి గోడకూలి సూర్య హరిజన్‌పై పడగా ఆమె మృతి చెందింది. వృద్ధురాలి కుటుంబాన్ని కోట్‌పాడ్ తహసీల్దార్ కీర్తి చరణ్ ప్రధాన్ పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జలాశయంలో పడవ బోల్తా

● ఒకరు గల్లంతు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా బోడపోడ పంచాయతీ సిలిగూడ గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం పరుశురామ్ గోలారీ, అతని భార్య చంప గోలారీలు అతని తండ్రితో కలిసి ముగ్గురూ చిత్రకొండ జలాశయంలో చేపలు పట్టేందుకు చిత్రకొండ జలాశయంలోకి వెళ్లారు. వారు కొంతదూరం వెళ్లిన తర్వాత పడవ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నీటిలో ముగ్గురూ పడిపోయారు. అయితే పరుశురామ్ గోలారీ జలాశయంలో కొట్టుకుపోగా, మిగతా ఇద్దరు ఒడ్డుకు చేరారు. అనంతరం గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారంతా వచ్చి వెతికారు. చిత్రకొండ పోలీసు ఐఐసీ ముకుందో మేల్కకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందిని పిలిచి రంగంలోకి దింపారు. అయినప్పటికీ ఆచూకీ లభించక పోవడంతో ఇంకా గాలింపు కొనసాగుతోంది.

జూదరుల అరెస్టు



అరెస్టైన జూదరులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి గుమడ మెయిన్ మార్కెట్‌లో మంగళవారం రాత్రి ఒక పేకాట శిబిరంపై గుడారి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మందిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.65,474 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, మరో 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి వారిని బుధవారం కోర్టుకు తరలించారు.

రచ్చ.. రచ్చ..!

● పోలవరంపై మాటల యుద్ధం
● బీజేడీపై బీజేపీ ఎదురుదాడి
● అప్పట్లో ఎన్‌వోసీ ఎలా ఇచ్చారని ప్రశ్న



భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పోలవరం బహుళార్థసాధక నీటి పారుదల ప్రాజెక్టుపై రాష్ట్రంలోని అధికార, విపక్షాలు రచ్చకు దిగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం నిధులు కేటాయించి ప్రాజెక్టు పూర్తికి హామీ ఇవ్వడంతో రాష్ట్రంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ విరుచుకుపడుతోంది. క్షేత్రస్థాయిలో బాగోగులను ప్రత్యక్షంగా సమీక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపింది. ఈ బృందం పోలవరం ప్రాజెక్టు మల్కన్‌గిరి జిల్లాకు హానికరమని సమగ్ర నివేదికని బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు సమర్పించింది. నివేదిక పరిశీలన మేరకు ఈ ప్రాజెక్టుని పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు, గ్రామీణ ప్రాంతం నుంచి శాసన సభ వరకు వ్యతిరేకించాలని నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు.

బీజేడీపై బీజేపీ మండిపాటు

విపక్ష బిజూ జనతా దళ్ వైఖరిని అధికార భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పోలవరం ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో కొనసాగుతున్న వివాదంపై బిజూ జనతా దళ్ (బీజేడీ) నిద్రపోతోందని నవరంగపూర్ భారతీయ జనతా పార్టీ ఎంపీ బలభద్ర మాఝీ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపక్ష బీజేడీ చౌకబారు రాజకీయాలకు పాల్పడుతుందని ఎద్దేవా చేశారు. పోలవరం ఆనకట్ట ప్రాజెక్టును మంజూరు చేయడానికి ముందు, ప్రభావితమయ్యే రాష్ట్రాల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) జారీ అనివార్యమని పేర్కొన్నారు. ఈ విషయానికి వస్తే అప్పట్లో అనగా 2000 సంవత్సరంలో కేంద్ర జలవనరుల శాఖ బీజేడీకి చెందిన ఒక మంత్రిచే నిర్వహించబడిందని గుర్తు చేశారు. మల్కన్‌గిరి సరిహద్దులో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ ప్రాజెక్టు పనులు 2004లో ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. అప్పుడు ఒడిశా ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టుకు ఎవరు ఎన్‌ఓసీ ఇచ్చారని ప్రశ్నించారు.

మల్కన్‌గిరికి ముంపు ప్రమాదం

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్స్ ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో దాదాపు 30 శాతం భూమిని ముంచుతాయని బీజేడీ ఆరోపిస్తోంది. పోలవరం ప్రాజెక్ట్ కార్యాచరణతో ఆ జిల్లాలోని దాదాపు 200 గ్రామాలు మునిగిపోతాయని చెబుతోంది. రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని మరియు ఈ విషయంలో ఒడిశా దుస్థితిపై కేంద్రం దృష్టిని ఆకర్షించాలని డిమాండ్ చేస్తోంది. ఒడిశా ప్రయోజనాలను విస్మరించి పోలవరం ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతే బీజేడీ ఆందోళనకు దిగుతుందని హెచ్చరించింది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో పోలవరానికి కేంద్రం రూ.15,000 కోట్లు కేటాయించిందని, ఫిబ్రవరి 2026 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉందని ప్రకటించింది. ఈ బడ్జెట్ కేటాయింపు తర్వాత, బీజేడీ కార్యాచరణలోకి దిగింది. పరిస్థితిని సమీక్షించడానికి పార్టీ అధిష్టానం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

నవీన్ చేతిలోనే జలవనరుల విభాగం

మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 2000 నుంచి 2024 వరకు ఒడిశా ప్రభుత్వ జలవనరుల విభాగానికి నాయకత్వం వహించారని ఎంపీ బలభద్ర మాఝీ గుర్తు చేశారు. అప్పుడు మరి ప్రాజెక్ట్‌ను ఆపడానికి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వారి అనిశ్చితి, లోపభూయిష్ట విధానాల వల్ల ఒడిశా ప్రజలు నేడు వైపరీత్యం ఎదుర్కోవాల్సి వస్తోందని దుయ్యబట్టారు. నవరంగపూర్ నుంచి బీజేడీ ఎంపీగా తాను అనేక సార్లు అప్పట్లో కేంద్ర ముందు పోలవరం సమస్యను లేవనెత్తాలని అభ్యర్థించినా పెడచెవిన పెట్టారని మండిపడ్డారు. పోలవరం విషయంలో ఒడిశా ప్రయోజనాలను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వం, ఒడిశాకు చెందిన ముగ్గురు కేంద్ర మంత్రులు, 20 మంది భారతీయ జనతా పార్టీ ఎంపీలు విఫలమయ్యారని బీజేడీ నేతలు ఆరోపించిన నేపథ్యంలో ఘాటుగా స్పందించారు.

మంత్రుల దృష్టికి రాయగడ సమస్యలు



మంత్రులకు వినతిపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే అప్పల స్వామి, నీలమాధవ

రాయగడ: జిల్లాలో తాండవిస్తున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికకలు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, విద్యాశాఖ మంత్రి నిత్యానంద్ గోండ్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రవి నారాయణ్ నాయక్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వారికి వినతిపత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో అధిక శాతం మంది నిరుపేదలైన ఆదివాసీలు నివసిస్తున్నారని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రిపై ఆధారపడుతుంటారని పేర్కొన్నారు. గత కొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో, వారికి సకాలంలో చికిత్స అందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. అదేవిధంగా బెడ్ల కొరత కారణంగా రోగులు ఆరుబయటే చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల కొరత కారణంగా మెరుగైన చికిత్సను పొందలేక ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా తాగునీటి సమస్య, విద్యావిధానంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు.

వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు



అనుగురులో జనసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ అనూప్ పండా

పర్లాకిమిడి: సుభద్ర పథకానికి సంబంధించి దరఖాస్తుదారుల నుంచి వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ అనూప్ పండా హెచ్చరించారు. పథకం అమలుకు సంబంధించి గజపతి జిల్లాలోని జనసేవ, సీఎస్‌సీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. అభ్యర్థుల దరఖాస్తులను అభ్యంతరం చెప్పకుండా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. లేకుంటే జనసేవ కేంద్రాలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. బొలంగీర్‌లో జనసేవ కేంద్రాలు సుభద్ర పథకం అమలుకు నిరాకరించడంతో ప్రజలు దేహశుద్ధి చేశారు. దీంతో అధికారులు ప్రతీ సమితి కేంద్రంలో పనిచేస్తున్న జనసేవ కేంద్రాలను పరిశీలిస్తున్నారు.

ట్రాక్టర్‌లో గర్భిణీ తరలింపు



ట్రాక్టర్‌లోనే గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి నూవగూడ గ్రామంలో మాణి గోలారీ అనే మహిళకు బుధవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంలోని ఆశ కార్యకర్తకు సమాచారం అందజేశారు. ఆమె వచ్చి పరిశీలించి బిడ్డ అడ్డం తిరిగిందని, మత్తిలి ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇచ్చింది. దీంతో గ్రామంలో వరద నీరు ఉండడంతో ట్రాక్టర్‌లో వైద్య బృందం గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఆమెకు ప్రాథమిక వైద్యం అందించి అదే ట్రాక్టర్‌లో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే ఆపరేషన్ చేయాల్సి ఉండడంతో అనంతరం గర్భిణిని మల్కన్‌గిరి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు

ప్రేమే నేరమా..!

● ప్రేమికుల జంటపై దాడి
● ప్రియుడు దుర్మరణం, చికిత్స పొందుతున్న ప్రియురాలు



గాయాలతో పడివున్న లలిత



ఘటన స్థలంలో మంగుళు మృతదేహం

రాయగడ: తన కూతురి ప్రేమ వ్యవహారం నచ్చక ప్రేమజంటపై ఒక వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడాజోర్ గ్రామానికి చెందిన మంగుళు మాఝి, ఒడాటికిరి గ్రామానికి చెందిన లలిత మాఝిలు గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వీరిద్దరూ ఇళ్ల నుంచి ఎవరికీ చెప్పకుండా పారిపోయారు. వారం రోజుల క్రితం మళ్లీ ఇంటికి తిరిగి వచ్చి, ఇద్దరు ప్రేమికులు ఎవరి ఇంట్లో వారు ఉంటున్నారు. అయితే మంగళవారం తనను ఎక్కడికైనా తీసుకెళ్లి పెళ్లి చేసుకోవాలని లలిత తన ప్రియుడు మంగుళుకు ఫోన్‌చేసి చెప్పింది. దీంతో మంగుళు మంగళవారం రాత్రి లలితను బైకుపై తీసుకెళ్తుండగా ఒడాటికిరి సమీపంలో కాపు కాసిన లలిత తండ్రి బిజయ్ మాఝి ఇద్దరిపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో మంగుళు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రగాయాలతో లలిత కింద పడిపోయింది. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరినీ చూసిన బిజయ్ మంగుళు మృతి చెందాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగుళు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని లలితను ఆస్పత్రికి తరలించారు. లలిత ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆమెను జిల్లా కేంద్రాస్పత్రికి మెరుగైన చికిత్స కోసం బుధవారం తరలించారు. హత్యకు పాల్పడిన బిజయ్‌ను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

రూ.56,116లకు లడ్డూ వేలంపాట



వైభవ గణపతి

భువనేశ్వర్: జాజ్‌పూర్ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏటా గణనాథుడు పూజలు అందుకోవడం విశేషం. స్థానిక ప్రవాసాంధ్రులు సమైక్యంగా ఈ పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గణనాథునికి సమర్పించిన లడ్డు క్రమంగా ప్రాధాన్యత సంతరించుకుంటోంది. పూజల అనంతరం ఈ లడ్డు సొంతం చేసుకునేందుకు భక్తులు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నిర్వహించిన లడ్డు వేలంలో దీని ధర అక్షరాల రూ.56,116లకు పలికింది. జి.ఎస్. సుబ్రహ్మణ్యం వేలంపాటలో లడ్డూని సొంతం చేసుకున్నారు. స్వామి ప్రసాదం తనకు లభించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

జగన్నాథుడి దర్శనం సౌకర్యవంతం



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ స్వామి భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శన అనుభూతిని అందించే ప్రయత్నంలో సరికొత్త సన్నాహాలకు నడుం బిగించడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం పూరీలోని పవిత్రమైన శ్రీజగన్నాథ దేవాలయంలోని నాట్య మండప్ (ప్రేక్షకుల, భక్తుల ఆవరణ)లో ఎయిర్ కండిషనింగ్ చేసే ప్రణాళిక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. రద్దీ సీజన్లలో కిక్కిరిసిన భక్తులు నాట్య మండపంలో ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యే ఇబ్బందికర పరిస్థితుల నివారణకు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఎయిర్ కండిషనింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా రద్దీ, వేడి కారణంగా భక్తులు ఎదుర్కొనే సవాళ్లను నివారించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు శ్రీజగన్నాథ ఆలయ పాలక వర్గం (ఎస్‌జేటీఏ) నిర్ణయం తీసుకుంది. సంబంధిత వాటాదారులందరితో విస్తృతమైన సంప్రదింపుల తర్వాత ఎయిర్ కండిషనింగ్ ప్రాజెక్ట్ బాధ్యతను శ్రీజగన్నాథ ఆలయ పరిపాలన, పూరీ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్లతో కూడిన సంయుక్త కమిటీకి అప్పగించారు. ఈ కమిటీ ఆలయంలో భక్తుల దివ్య అనుభవాన్ని పెంపొందించడానికి ఒక సమన్వయ విధానాన్ని నిర్ధారిస్తుందని వర్గాలు తెలిపాయి.

వృద్ధులకు ప్రత్యేక క్యూలు

భక్తులందరికీ దర్శనం సులభతరం చేయడానికి వృద్ధ సందర్శకుల కోసం ప్రత్యేక క్యూలు కేటాయించబడతాయి. దర్శన ప్రాంగణం మరింత సువిశాలంగా విస్తరించేందుకు ఆలయ పాలక వర్గం సన్నాహాలు చేస్తోంది. రత్న భాండాగారం నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ కార్యకలాపాలు పురస్కరించుకుని దీని నుంచి తొలగించిన బీరువాలు, చెక్క పెట్టెలను తాత్కాలికంగా ప్రేక్షకుల హాలులో భద్రపరిచారు. వీటిని ఈ ప్రాంగణం నుండి తొలగిస్తారు. ఈ ప్రక్రియ ముగిసే వరకు రద్దీ నియంత్రణ కోసం ఆలయం లోపల బారికేడ్లు లేదా మానవహారం ఏర్పాటు చేయాలనే యోచన పాలక మండలి పరిధిలో పరిశీలనలో ఉంది.

వ్యయ మంజూరి బిల్లు ఆమోదం



శాసన సభ సమావేశాలు జరుగుతున్న దృశ్యం

భువనేశ్వర్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.65 లక్షల కోట్ల నిధుల కేటాయింపు (వ్యయ మంజూరి) బిల్లును రాష్ట్ర శాసన సభ ఆమోదించింది. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతా దళ్ ప్రభుత్వ 24 ఏళ్ల పాలనకు ముగింపు పలికి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార భారతీయ జనతా పార్టీ మొదటి బడ్జెట్‌ను ఈ ఏడాది జూలై 25న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సమర్పించిన విషయం తెలిసిందే. నిధుల కేటాయింపు బిల్లుపై మంగళవారం సభలో చర్చించారు. ఈ చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 2036 నాటికి వికసిత్ ఒడిశా ఏర్పాటు కల సాకారం చేసేందుకు ఈ బడ్జెట్‌లో మార్పు, అభివృద్ధి, సుపరిపాలన, ఒడియా అస్మిత (ఆత్మ గౌరవం) అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బడ్జెటు రూప కల్పనకు గతేడాది కంటే ఆరు రెట్లు అధికంగా సూచనలు వచ్చాయన్నారు.

– ఆర్థిక లోటు రూ.31,403 కోట్లు

2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటు రూ.32,403 కోట్లుగా ఉందని, ఇది రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 3.5 శాతంగా ఉందని, ఇది ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థకు సంకేతమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్ష బీజేడీ పాలనలో గత మూడు సంవత్సరాలుగా జరుగుతున్న పాఠశాలల పరివర్తన నాటకీయమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ పాఠశాలల వాస్తవ రూపం ఇప్పుడు తెరపైకి వస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రకటించిన వివిధ పథకాలను ప్రస్తావిస్తూ, ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుశిక్షితులైన ఉపాధ్యాయుల లభ్యతపై బిజూ జనతా దళ్ ప్రభుత్వం ఎటువంటి శ్రద్ధ చూప లేదని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో విద్య నాణ్యత, విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు గోదాబరీష్ మిశ్రా ఆదర్శ ప్రాథమిక విద్యాలయ పథకం, పంచసఖ శిక్షా సేతు అభియాన్ తదితర పథకాలతో కూడిన బడ్జెట్‌లో తన ప్రభుత్వం ప్రకటించిన అనేక పథకాలను నిధుల కేటాయింపు చర్చలో భాగంగా సీఎం ప్రస్తావించారు. అలాగే బీజేడీ హయాంలో వైద్యం కేవలం టెలివిజన్, సోషల్ మీడియాకే పరిమితమైందని దుయ్యబట్టారు. వాస్తవానికి ప్రజలకు సముచిత వైద్యారోగ్య సేవలు అక్కరకు రాకపోవడంపై విచారం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



బ్యాంక్ అధికారులకు చెక్ అందజేస్తున్న రామారావు

రాయగడ: పొరుగు రాష్ట్రమైన ఆంధ్రలో వరద బాధితులను ఆదుకునేందుకు తన వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని స్థానిక హతీపథర్ రోడ్డులో నివసిస్తున్న ఎం.రామారావు అందించారు. ఈ మేరకు ఆ మొత్తం చెక్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా బుధవారం పంపించారు. తన మనమరాలి పుట్టిన రోజుకు ఆ మొత్తం ఖర్చు చేయాలని మొదట్లో నిర్ణయించగా, హఠాత్తుగా ఆంధ్రలో వరద ముంపునకు గురై ఎంతోమంది బాధపడుతున్నారని తలచి వెంటనే ఆ సొమ్మును సీఎంఆర్ఎఫ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. దీంతో రామారావు ఔదార్యాన్ని పలువురు అభినందించారు.

కొండచిలువ కలకలం



పట్టుబడిన కొండ చిలువ

రాయగడ: జిల్లాలోని గుడారి వంశధార మూడో లైన్ సమీపంలో ఉన్న ఆర్ఐ కార్యాలయం వెనుక పది అడుగుల కొండ చిలువ బుధవారం కలకలం సృష్టించింది. కార్యాలయం వెనుకనున్న తుప్పల్లో శబ్దం రావడంతో అటువైపుగా వెళ్లే కొందరు కొండ చిలువను చూసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న సిబ్బంది పట్టుకుని అంధారిలిమ్మ సంరక్షణ అడవులకు తీసుకెళ్లి, అక్కడ విడిచిపెట్టినట్లు అధికారులు తెలియజేశారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం



బాధితురాలు కింతలి లావణ్య

రాయగడ: ఒక మహిళ మెడలో బంగారు చైన్ చోరీయత్నం జరిగింది. బుధవారం సాయంత్రం నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు కింతలి లావణ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం బాధితురాలు లావణ్య తన కూతురితో కలిసి రాయగడ మార్కెట్‌కు వెళ్లి తిరిగి వస్తోంది. ఆ సమయంలో స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చర్చి వద్ద ఇద్దరు దుండగులు తిరుగుతుండడం గమనించి చైన్ స్నాచర్లుగా గుర్తించి జాగ్రత్త పడింది. ఇంతలోనే ఆ దుండగులు ఆమె మెడలో బంగారు చైన్‌ను లాక్కువెళ్లే ప్రయత్నం చేయగా ఆమె గట్టిగా పట్టుకుంది. దీంతో చైన్‌ను తెంచలేక దుండగులు పరారయ్యారు. అయితే ఈ ఘటనలో బాధితురాలు మెడకు గాయాలు తగిలాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా రహదారి



బురదమయంగా ఉన్న బుజుగుడ రహదారి

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పొలమ పంచాయతీలోని బుజుగుడకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. బుజుగుడ నుంచి అరడి గ్రామానికి అనుసంధానించే ఈ రహదారిని బాగు చేయమని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో కనీసం నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

వీడని వరద..!

వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు మల్కన్‌గిరి, కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినా ఇంకా వరదలోనే పలు గ్రామాలు ఉన్నాయి. వరద తగ్గిన ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి చూసిన ప్రజలు మొత్తం బురద చేరడంతో లబోదిబోమంటున్నారు. అలాగే రహదారులు కొట్టుకుపోవడంతో ఇంకా రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది. పంట పొలాలు ముంపునకు గురవ్వడంతో నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



మల్కన్‌గిరి: చెల్లాచెదురైన సామగ్రి



మల్కన్‌గిరి: కొట్టుకుపోయిన ఇళ్లలోని సామగ్రి



మల్కన్‌గిరి: పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న బాలికలు



మల్కన్‌గిరి: పొడియా - కలిమెల మధ్య కన్యాశ్రమం రహదారి



మల్కన్‌గిరి: ఎంవీ 90 గ్రామం వద్ద ముంపులోనే ఉన్న పంటపొలాలు



జయపురం: మాచ్‌ఖండ్ ప్రాజెక్టులోకి చేరిన నీరు



జయపురం: జోలాపుట్ ప్రాంతంలో కొట్టుకుపోయిన ఇనుప వంతెన



జయపురం: కొరాపుట్ జిల్లా చింద్రిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



మల్కన్‌గిరి: ఎంవీ 7 గ్రామం వద్ద రహదారి దుస్థితి



మల్కన్‌గిరి: అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీసీ రోషణీ సాహు



జయపురం: లమతాపుట్‌లో వరదలకు కొట్టుకుపోయిన బ్రిటిష్ కాలం నాటి వంతెన



మల్కన్‌గిరి: కొట్టుకుపోయిన ఎంవీ41 గ్రామ రహదారి



మల్కన్‌గిరి: వరద ప్రాంతంలో గిరిజన మహిళలతో మాట్లాడుతున్న రోషణి సాహు



బలిమెల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

జనసేవ కేంద్రాల నిర్వాహకుల నిరసన



కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌తో మాట్లాడుతున్న నిర్వాహకులు

పర్లాకిమిడి: సుభద్ర పథకం అమలుపై జిల్లాలోని జనసేవ కేంద్రాల నిర్వాహకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పట్టణంలోని కలెక్టరేట్‌కు బుధవారం వెళ్లి కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌ను కలిశారు. సుభద్ర యోజన పథకం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు జిల్లా అధికారులు కేవలం రూ.15లు మంజూరు చేస్తున్నారని, అయితే దాంట్లో జీఎస్టీ మినహాయిస్తే కేవలం రూ.10లు మాత్రమే మిగులుతుందన్నారు. ఇది ఎంతమాత్రం సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.


వంశధార తగ్గుముఖం



గొట్టు బ్యారేజీ వద్ద దిగువకు విడిచిపెడుతున్న నీటి ప్రవాహం

హిరమండలం: వంశధార గొట్టుబ్యారేజీ వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం బ్యారేజీలో 37.37 మీటర్ల నీటిమట్టం ఉంది. బుధవారం ఉదయానికి 17200 క్యూసెక్కులు, మధ్యాహ్నానికి 15878 క్యూసెక్కులు, సాయంత్రానికి 14250 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గుతూ వచ్చింది. 10 గేట్లు పైకి ఎత్తి దిగువకు 13319 క్యూసెక్కులు విడిచిపెట్టారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 104 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 341 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నట్లు డీఈ ఎం.రంగనాయకులు తెలిపారు.

కారు ఢీకొని విశ్రాంత ప్రిన్సిపాల్ మృతి



పూజారి శ్రీరాములు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కింతలిమిల్లు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశవరావుపేటకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ పూజారి శ్రీరాములు(77) మృతి చెందారు. రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఘటనా స్థలంలోనే తుదిశ్వాస విడిచారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీరాములుకు భార్య, కుమారుడు ఉన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకునిగా విధులు నిర్వర్తించిన శ్రీరాములు స్వగ్రామం కేశవరావుపేట. శ్రీకాకుళం పట్టణంలో నివాసముంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వస్తుండేవారు.

రోగికి వైద్యుడి రక్తదానం

కాశీబుగ్గ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్యసేవలు అందించడమే కాదు అవసరమైనప్పుడు రక్తదానం చేసి ప్రాణాలు సైతం నిలుపుతామని నిరూపించారు డాక్టర్ నంబాళ్ల శ్రీనివాసరావు. వజ్రపుకొత్తూరు మండలం దోకులపాడు గ్రామానికి చెందిన తామాడ నారాయణమ్మ పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బుధవారం 'ఏ నెగిటివ్' గ్రూపు రక్తం అత్యవసరం కావడంతో ఆ నలుగురు ట్రస్ట్ చైర్మన్ పిచ్చుక పాపారావు ఇచ్చిన సమాచారం మేరకు పలాసలోని డాక్టర్ వైఎస్ఆర్ కిడ్నీ పరిశోధన కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నంబాళ్ల శ్రీనివాసరావు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును కిడ్నీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర కూన మోహనబాబు అభినందనలు తెలిపారు.

15న కొన్న చిన్నారావు అథ్లెటిక్స్ మీట్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో భారీ వర్షాల కారణంగా వాయిదాపడిన కొన్న చిన్నారావు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలు ఈ నెల 15న నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. అండర్ 14, 16, 18, 20 వయో విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా రన్నింగ్, త్రోస్, జంప్స్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. ఇక్కడ రాణించిన వారిని గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని మీట్ నిర్వాహకుడు, అథ్లెటిక్స్ సంఘ రాష్ట్ర, జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు) తెలిపారు. పూర్తి వివరాలకు అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి, పీడీ మెంటాడ సామమూర్తి (సెల్:85002 71575)ని సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 14, 15 తేదీల్లో భీమిలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ బుధవారం అభినందించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ప్రగతి సాధ్యం



కమ్యూనిటీ విద్యా కేంద్రంలో మహిళలు

రాయగడ: చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందని ఇంఫా కర్మాగారానికి చెందిన ప్రజా సంబంధాల అధికారి శక్తి ప్రసాద్ పాణిగ్రాహి అన్నారు. జిల్లాలోని తెరువలిలో ఉన్న ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లోయిస్ (ఇంఫా) సంస్థకు చెందిన వంశీధర్, ఇలా పండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెరువలి ప్రాంతంలోని గౌడాగుడ, రెలిబడిగా, రామచంద్రనగర్, పూజారిగుడ గ్రామాల్లో కమ్యూనిటీ విద్యా కేంద్రాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాణిగ్రాహి మాట్లాడుతూ ఇంఫా సంస్థ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా కమ్యూనిటీ విద్యా కేంద్రాలను ఏర్పాటు చేసిందని వివరించారు. గ్రామాల్లోని మహిళలు చదువుకునేందుకు ఈ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ చదువుకుంటే సామాజిక చైతన్యం కలుగుతుందనే ఉద్దేశంతో ఈ కేంద్రాలను కర్మాగారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రాధాశ్యామ్ పండ, ఖిదాపడ పంచాయతీ సర్పంచ్ నరసింహ హికక తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా కొరాపుట్ విద్యార్థినులు



నాటక పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కొరాపుట్ విద్యార్థినులు

జయపురం: పట్టణంలోని జిల్లా విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన విజ్ఞాన సంబంధిత నాటక పోటీల్లో కొరాపుట్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 18 పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం కొరాపుట్ పొందగా, ద్వితీయ స్థానంలో మనబార్ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో జయపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు నిలిచారు. ప్రథమ స్థానం పొందిన టీమ్ త్వరలో రాయగడలో జరగనున్న జోనల్ స్థాయి పోటీలో పాల్గొంటుందని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా విద్యాధికారి ప్రమోద్ కుమార్ మహంతి, కళాకారుడు ధీరెన్ మోహన్ పట్నాయక్, జయపురం బీఈవో చందన కుమార్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం తగదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఢిల్లీలో జాతీయస్థాయిలో మాల పెద్దలు తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా శ్రీకాకుళం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును వెనక్కి తీసుకోవాలని, పునఃపరిశీలించాలని నినాదాలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ, ఎస్టీ, మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సౌకర్యాలను కల్పించి అండగా నిలవాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. అనంతరం ఇలిసిపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో దళిత మహాసభ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంజి ఆర్.ఎజ్రా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర దళిత మహాసభ గౌరవ అధ్యక్షుడు పి.బెంజిమన్, మాల మహానాడు రాష్ట్ర కన్వీనర్ ఎన్.భరత్ భూషణ రాజు, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు పోతల దుర్గారావు, ఎస్సీ వర్గీకరణ సమితి జిల్లా కన్వీనర్, బోకర నారాయణరావు, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు అంపోలు ప్రతాప్, రాంబాబు, శ్యామసుందర్, సీర రమేష్, బి.మురళీకృష్ణ, సాకేటి నాగరాజు, వై.గడ్డెయ్య, గోవిందు, డి.రాము, మూర్తి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షుడిగా విద్యాసాగర్



షర్మిల నుంచి నియామక పత్రం అందుకుంటున్న మరిపి విద్యాసాగర్

బొబ్బిలి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బొబ్బిలి నియోజక వర్గానికి చెందిన తనను ఏపీసీసీ నియమించిందని మరిపి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసాగర్ బొబ్బిలి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గతంలో పోటీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తనకు నియామక పత్రం అందజేసినట్లు ఆయన ప్రకటించారు. పార్టీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు



గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న మహిళ

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై ఎస్.కోట నుంచి విశాఖ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు తుళ్లిపోయి పక్కనే ఉన్న గోతిలో పడిపోయారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వారికి సపర్యలు చేశారు. కాగా మహిళా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. భార్యాభర్తలను వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ షణ్ముఖరావు తెలిపారు.


వర్క్‌షాప్ ప్రారంభం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హరిశంకరన్

విజయనగరం ఫూల్‌బాగ్: మహారాజా ఫార్మసీ కళాశాలలో కరెంట్ ట్రెండ్స్ ఇన్ బయోఫార్మాస్యూటికల్స్ అండ్ ఇన్‌సిల్కో అప్లికేషన్స్ మీద మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ రిటైర్డ్ సైంటిస్ట్(హైదరాబాద్)డాక్టర్ ఎస్‌హరిశంకరన్, ప్రొఫెసర్ ఎం.రామయ్య, వైస్ ప్రిన్సిపాల్ తదతరులు ప్రసంగించారు. కార్యక్రమానికి మాన్సాస్ విద్యాసంస్థల నుంచి సుమారుగా 130 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న వీణ కచేరీ



వీణకచేరీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో కొలువుదీరిన గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విదార్థులు బుధవారం సాయంత్రం గణనాథునికి వీణ కచేరీ నిర్వహించారు. వీణా వాయిద్యంలో ఐ.గౌతమి, శివాని, డి.పావని దుర్గ, వి.గణేష్‌లు అలరించారు. గణేష్ మృదంగంపై సహకరించారు. అనంతరం కాకినాడకు చెందిన ఆకుండి శ్రీనివాసరాజారావు నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై ఎం.నీలాద్రి రావు, మృదంగంపై ఎం.ఏడుకొండలు సహకరించారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ కేపీవీఎల్ఎన్.శాస్త్రి పర్యవేక్షించారు.

కారు ఢీకొని మూడు పశువుల మృతి



మృతి చెందిన పశువులు

గంట్యాడ: కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో మూడు పశువులు మృతిచెందగా మరో రెండు పశువులకు గాయాలయ్యాయి. గంట్యాడ మండలంలోని కొత్త వెలగాడ గ్రామానికి చెందిన తలారి అప్పలసత్యానికి చెందిన పశువులను మదనాపురం కొండపైకి మేత కోసం తోలు కెళ్లి తిరిగి బుధవారం రాత్రి కొత్త వెలగాడ తోలుకుని వస్తుండగా మదనాపురం జంక్షన్ వద్ద విశాఖపట్నం నుంచి చినమధుపాడ వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయి కృష్ణ తెలిపారు.


సొగసు చూడ తరమా..!

నింగి నేలను ముద్దాడిందా? దివి నుంచి సూర్యుడు భూమికి దిగి వచ్చాడా? అన్నట్లు ప్రకృతి ప్రజలను పలకరించి మంత్రముగ్ధులను చేసింది. రవివర్మ కుంచె నుంచి జాలువారిన వర్ణచిత్రాల్లా కనిపించిన ప్రకృతి దృశ్యాలను బుధవారం సాయం సంధ్య వేళ తిలకించిన నగర ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. అస్తమిస్తున్న సూరీడి లేలేత కిరణాల సోయగాలు ట్యాంకుబండ్ రోడ్డులో గల పెద్ద చెరువులో సాక్షి కెమెరా కంటికి చిక్కాయి. ఆ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులను ఆ దృశ్యాలు కట్టిపడేశాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం




సాయంసంధ్య వేళ 5.28




5.31



5.34



5.42



5.46

బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ సాయం

- రూ.లక్ష పరిహారం అందజేత

నెల్లిమర్ల రూరల్: ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన భారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నెల్లిమర్ల మండలంలోని పారసాం గ్రామానికి చెందిన గెద్ద సంతోష్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడిన వారికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.లక్ష చెక్కును బాధితుడి తండ్రి వెంకటరమణకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఘటన బాధాకరమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ బాధితులకు తమ వంతు సాయం అందించారని చెప్పారు. చనిపోయిన వారికి రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.ఒక లక్ష ప్రకటించారని, ఇచ్చిన మాట ప్రకారం సాయాన్ని అందజేశారని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జగనన్న ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారన్నారు. గాయపడిన సంతోష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గదల సన్యాశినాయుడు, ఎంపీటీసీ సంగం రెడ్డి జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, అప్పలనాయుడు, మక్కువ వెంకటరమణ, బెల్లాన రామారావు, శంకర్రావు, మక్కువ రమణ, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి తండ్రి వెంకటరమణకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిసారించాలి

విజయనగరం టౌన్: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిసారించాలని ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ గోవింద రావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో గత నెల 5వ తేదీ నుంచి సెప్టెంబరు 10వరకూ సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్‌ను ఉన్నతి ఫౌండేషన్‌తో కలిసి నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో ముగింపు సభను కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శిక్షణ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తులో ఉద్యోగావకాశాల్లో సమర్థతను పెంచుకునేందుకు, వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ట్రైనర్స్‌గా శాంతిలత, ప్రత్యూషలు తరగతులను చక్కగా అందించగలిగారని ప్రశంసించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక ఉద్యోగానికి ఏదైనా కంపెనీకి వెళ్తే వారికి కావాల్సిన నైపుణ్యాలు ఉంటేనే తీసుకుం టారని, అందువల్ల విద్యార్థులు కచ్చితంగా ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయిదేవమణి మాట్లాడుతూ విద్యార్థులు వర్క్‌షాప్‌లో నేర్చుకున్న అంశాలను ప్రాక్టీస్ చేసి ఇంకా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ తరుణ్, అనిల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి డాక్టర్ గోవిందరావు

వసంత గెడ్డలో వ్యక్తి గల్లంతు

- గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గెడ్డలో స్థానికుడైన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే ఎల్. కోట మండలం సందులూరుకు చెందిన అప్పుబత్తుల సతీష్(30) అతని భార్య వరలక్ష్మి తో కలిసి అత్తవారి గ్రామం అయిన చంద్రంపేటకు బుధవారం వచ్చారు. తిరిగి సందులూరు వెళ్తుండగా చంద్రంపేట, వసంత గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డ దాటుతుండగా బండి స్లిప్ అవడంతో సతీష్ కింద గెడ్డలోకి జారిపోయి గల్లంతయ్యాడు. అతని భార్య వరలక్ష్మి కింద పడిన వెంటనే బండిని పట్టుకుని ఉండిపోవడంతో సురక్షితంగా బయటపడింది.

ముమ్మరంగా గాలింపు

సతీష్ గల్లంతైన వెంటనే చంద్రంపేట గ్రామస్తులు అక్కడికి చేరుకుని గాలించడం మొదలు పెట్టారు. ఈలోగా విషయం తెలుసుకుని ఆర్‌డీఓ ఆర్‌వీ సూర్యకళ, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీఓ భవాని, ఎస్సై సాయికృష్ణ అక్కడికి చేరుకుని ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను రప్పించారు. స్థానికులు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. రాత్రివరకు ఆచూకీ లభ్యం కాలేదు. ఆర్‌డీఓ సూర్యకళ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం



గల్లంతైన సతీష్ (ఫైల్)

అభివృద్ధిని అడ్డుకోవడం తగునా..?

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులు సాలూరు నియోజకవర్గంలో కొనసాగకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఈ విషయంలో జిల్లా యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయనను జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిసి తమకష్టాలను వివరించారు. ప్రజలకును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పనులు ప్రారంభిస్తామని అధికారులను అడిగితే ఇంకా కొంతకాలం ఆగాలని పనులు ప్రారంభించడం తమ హయాంలో వద్దని పంచాయతీ రాజ్, ఐటీడీఏ తదితర శాఖల అధికారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీలను బలోపేతం చేస్తానని కేంద్ర నిధులు సైతం నేరుగా సర్పంచ్‌లకు లింక్ చేయిస్తానని ప్రగల్భాలు పలికారని అలాంటప్పుడు ఎందుకు కూటమి నాయకులు పంచాయతీల అభివృద్ధిని అడ్డు కుంటున్నారని ప్రశ్నించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ ,శివరాంపురం ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథ, సర్పంచ్ జరజాపు మోహన్ , తుండ సర్పంచ్ సీదరపు నూకయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి న్యాయం?

విజయవాడ వరదలకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని, విపత్తు ముందుందని అధికారులకు తెలిసినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన విజయవాడ వరదబాధితుల కోసం మాట్లాడుతూ బుడమేరు విజయవాడ దుఃఖదాయిని అని తెలిసికూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరించిందని ఆరోపించారు.దాదాపు 4 లక్షల జనాభా ఉన్న పట్టణానికి వరద ముప్పు ఉందని తెలిసిన వెంటనే ఎందుకు అప్రమత్తం చేయలేకపోయారని ప్రశ్నించారు. రెవెన్యూఅధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ, మైన్స్, ఇంజినీరింగ్ అధికారులు బాధ్యతగా ప్రజలను అప్రమత్తం చేయాలి. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనుభవం ఎక్కడ పెట్టారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో రిటైనింగ్ వాల్ కట్టకపోతే కృష్ణలంక ప్రజలు ఎక్కడుండేవారోనన్నది తెలుసుకోకుండా జగన్ కారణంగానే ఈ విపత్తు సంభవించిందని ఆరోపణలు చేయడం చంద్రబాబునాయుడు చేసిన తప్పును కప్పిపుచ్చుకోడానికేనన్నా రు. తప్పు ఎవరు చేశారో తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టకుండా జగన్‌పై ఆరోపణలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్న చంద్రబాబునాయుడు అనుభవం ఎంతో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. విజయవాడ వరదలకు ఎవరు బాధ్యులో తెలియాలంటే వెంటనే సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

గోతిలో తిరగబడిన లారీ

బొబ్బిలి రూరల్: మండల పరిధిలోని పిరిడి జంక్షన్ నుంచి గొల్లపల్లికి వచ్చే ప్రధాన రహదారిపై కర్రల లోడుతో వెళుతున్న లారీ గోతిలో పడి తిరగబడింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలు కాగా భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఉదయం సంఘటన జరగ్గా మధ్యాహ్నానికి భారీక్రేన్లతో లారీని పక్కకు తొలగించారు.రహదారి వెంబడి వాహనాల రాకపోకలు నిలిచిపో యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.విషయం తెలుసుకున్న బొబ్బిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.పారాది గ్రామం వద్దనున్న ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోగా,పాత బ్రిడ్జిపైనుంచి 10 టన్నులకు మించి బరువున్న వాహనాలను అనుమతించడం లేదు.దీంతో ఈరహదారిపై వెళుతున్న భారీ వాహనాల కారణంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి.ఫలితంగా ఎక్కువ బరువున్న వాహనాలు గోతుల్లోకి దిగి బోల్తాపడుతున్నాయి.ఈ పరిస్థితుల్లో ఆరోజంతా వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు.ఉదయం జరిగిన ఈసంఘటనతో ఆయా గ్రామాలనుంచి పట్టణానికి చదువుకోసం వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురై నడుచుకుంటూ చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు,పాలకులు రోడ్ల మరమ్మత్తులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు,వాహనదారులు కోరుతున్నారు. ప్రతి సారీ ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతున్నప్పటికీ ఈ రహదారి బాగుకు చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

గుర్తింపేనట.. నిధులు లేవట!

- కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతరకు రాష్ట్ర పండుగగా మాత్రమే గుర్తింపు
- నిధులు కేటాయింపునకు అంగీకరించని సర్కారు
- కోటి రూపాయల నిధులు ఒట్టి హడావిడే
- టీడీపీ నేతల తీరుపై విమర్శలు



కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

‘కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర ఘనంగా జరుపుకొందాం.. రాష్ట్ర పండుగగా నిర్వహిద్దాం .. ప్రభుత్వం నుంచి గుర్తింపు తెస్తాం.. జాతర కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయిస్తాం..’ ఇదీ ఎన్నికల ముందు ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన ప్రకటన.

ఆ హామీని నెరవేర్చారని టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున హడావుడి చేస్తున్నారు. కొత్తమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయమే. కానీ, రాష్ట్ర పండుగగా గుర్తించి, జారీ చేసిన జీవోలో ప్రస్తావించిన అంశాలు ఆశ్చర్యం కల్గిస్తున్నాయి. ఒక్క పైసా కేటాయించకుండా జీవో విడుదల చేసి, సింగిల్ అజెండా ప్రకటనలా ప్రభుత్వం చేతులు దులుపుకొంది. కలెక్టర్ ఆధ్వర్యంలో శాఖల సమన్వయంతో పండుగ ఘనంగా జరిగేలా జీవోలో పేర్కొంది. వాస్తవంగా కొత్తమ్మతల్లి జాతర ప్రతీ సంవత్సరం భారీ ఏర్పాట్లు, బందోబస్తు మధ్యే జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఇప్పుడిచ్చే రాష్ట్ర పండుగ జీవోలో అవే అంశాలున్నాయే తప్ప ప్రత్యేకించి ఏమీ లేవు. సాధారణంగా రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి, మరింత ఘనంగా జరుపుకొనేందుకు సహాయ పడాలి. తాజాగా ఇచ్చిన జీవోలో మాత్రం ఎటువంటి ఆర్థిక సాయం లేకుండా రాష్ట్ర పండుగగా జరుపుకొనేందుకు గుర్తింపునిస్తున్నట్లు స్పష్టం చేసింది. చెప్పాలంటే రాష్ట్ర పండుగకైతే ఓకే.. నిధులు మాత్రం ఇవ్వలేమన్నట్టుగా జీవో ద్వారా తెలియజేసింది.

అరసవిల్లి ఆదిత్యాలయానికి పట్టువస్త్రాల బాధ్యత జాతర సందర్భంగా కొత్తమ్మతల్లికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను జిల్లా మంత్రి సమర్పించనున్నారు. దీనికోసం ఒక్క రూపాయి విడుదల చేయలేదు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం నిధుల నుంచి తీసి పట్టు వస్త్రాల కోసం ఖర్చు చేయాలని స్పష్టం చేసింది. దీన్నిబట్టి రాష్ట్ర పండుగగా గుర్తించి జీవో ఇవ్వడం తప్ప కొత్తమ్మతల్లి జాతరకు కొత్తగా ఇచ్చిందేమి లేదు. ఈ జీవోను క్షుణ్ణంగా పరిశీలించకుండా అమ్మవారి జాతరకు కోటి రూపాయల నిధులు మంజూరు చేసినట్టు అధికార వర్గాలు లీకులిచ్చి పెద్ద ఎత్తున ప్రచారం చేయడం విమర్శలకు దారితీసింది. బుధవారం ఉదయం నుంచి రాష్ట్ర పండుగ గుర్తింపు...కోటి రూపాయల నిధులు మంజూరుపై టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేసినప్పటికీ.. జీవోలో ఉన్న అంశాలను ప్రస్తావిస్తూ కౌంటర్లు పడటంతో ఒక్కసారిగా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన

- నల్ల రిబ్బన్లతో విధులకు హాజరు
- దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్న వైద్యులు
- క్లినికల్ కోటా 30 శాతం, నాన్ క్లినికల్ కోటా 50 శాతం పెంచాలని డిమాండ్

విజయనగరం ఫోర్ట్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో పనిచేసే వైద్యులు పీజీ వైద్య విద్యను అభ్యసించేందుకు ఇచ్చే ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించడంతో వారంతా ఉద్యమబాట పట్టారు. తమ డిమాండ్ నేరవేర్చక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గతంలో ఉన్న ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడం పట్ల మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు బుధవారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రభుత్వం స్పందించకుంటే 18వతేదీ నుంచి నిరవధిక నిరహార దీక్షలకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు.

ఇన్‌సర్వీస్ కోటా తగ్గింపు

పీహెచ్‌సీ వైద్యులకు పీజీ వైద్యవిద్యలో ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గిస్తూ జీఓ నంబర్ 85ను జారీ చేసింది. గతంలో ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం ఉంటే దాన్ని 15 శాతానికి తగ్గించారు. నాన్ క్లినికల్ కోటాను 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించారు. గతంలో మాదిరి క్లినికల్ కోటాను 30 శాతానికి, నాన్ క్లినికల్ కోటాను 50 శాతానికి పెంచాలని వైద్యులు కోరుతున్నారు. ఇన్‌సర్వీస్ కోటా తగ్గిస్తూ ఇచ్చిన జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ఆకస్మాత్తుగా జీఓ ఇవ్వడం అన్యాయమని వాపోతున్నారు. ఈజీఓ వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీఓను రద్దు చేయాలని పాలకులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన లేక పోవడంతో ఆందోళనకు దిగారు.



పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీతో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు



రాకోడు పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జితో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

జీఓ 85 రద్దు చేయాలి



ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 85ను రద్దు చేయాలి. ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం , నాన్ క్లినికల్ 50 శాతం యథాతథంగా అమలు చేయాలి. ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తే నష్టం కలుగుతుంది.

డాక్టర్ వెంకటేష్, గంట్యాడ పీహెచ్‌సీ, వైద్యుడు

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పోస్టల్ శాఖ ఏఎస్పీ సుందరనాయుడు

పూసపాటిరేగ: తపాలా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్‌శాఖ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ పి. సుందర నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌వీఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ‘జనంలోకి మనం’ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఇన్సూరెన్స్ పాలసీలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆధార్ కార్డులు, ఫోన్‌లింక్, పేరుమార్పులతో పాటు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పోస్టల్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. సుకన్య సమృద్ధి యోజన, మహిళాసేవింగ్ సమ్మాన్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సేవింగ్ బ్యాంక్ అకౌంట్, సీనియర్ సిటిజన్ స్కీమ్, తదితర పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సత్తిబాబు, పూసపాటిరేగ సబ్ పోస్ట్‌మాస్టర్ రాంబాబు, ప్రిన్సిపాల్ పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్ ఏఎస్పీ సుందరనాయుడు, తదితరులు